
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 13 । ఆగస్టు । 2024



వకుళమాత అన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవనానికి బొసానపల్లి రంగనాథ్, గంగా భాగ్యలక్ష్మి దంపతులు (నరసాపురం) రూ.50 వేల విరాళం అందించారు.




పశువులకూ ఓ లెక్క

8లో

ఇక పశువుల లెక్క పక్కాగా ఉండనుంది. మనుషుల మాదిరిగానే మూగజీవాల గణన జరగనుంది. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఈ ప్రక్రియ వచ్చే నెల 1 నుంచి మొదలు కానుంది.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 3,79,811 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 6.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 10,800 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ కార్యవర్గంలో జిల్లాకు స్థానం



కృష్ణ పద్మరాజు



వెంకటరమణ

అమలాపురం టౌన్: రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌లో జిల్లాకు రెండు పదవులు దక్కాయి. రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, రాష్ట్ర అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జిల్లా అసోసియేషన్ కోశాధికారి దొమ్మేటి వెంకటరమణ ఎన్నికయ్యారు. వీరిద్దరూ అమలాపురానికి చెందిన వారే. దీనిపై అమలాపురంలో సోమవారం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు ఓ ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లాకు ప్రాధాన్యం ఇస్తూ కృష్ణ పద్మరాజు, వెంకటరమణలకు అవకాశం లభించారన్నారు. వీరి ఎన్నిక పట్ల జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధులు నగభేరి కృష్ణమూర్తి, గారపాటి చంద్రశేఖర్, కత్తుల శ్రీనివాసరావు, మట్టపర్తి సముద్రం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్పీ కార్యాలయానికి 25 అర్జీలు



ఓ కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుపై వివరాలు సేకరిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 25 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు ఫిర్యాదులను స్వీకరించారు. రాయవరం మండలం పసలపూడికి చెందిన కొవ్వూరి లక్ష్మి తన తండ్రి కృష్ణ మృతికి కారణమైన బాధ్యులను శిక్షించాలంటూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అలాగే కొందరు ఫిర్యాదుదారులు కుటుంబ సమేతంగా వచ్చి తమ కుటుంబ తగాదాలను ఎస్పీకి చెప్పుకుని న్యాయం చేయాలని కోరారు. కొన్ని ఫిర్యాదులను ఎస్పీ అక్కడికక్కడే పరిష్కరించారు. అయితే మిగిలిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆయా ప్రాంతాల డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయ ప్రజా సమస్యల పరిష్కార వేదిక పర్యవేక్షణ ఎస్సై డి.శశాంక పాల్గొన్నారు.

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ



కోచ్‌తో పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులు

అంబాజీపేట: స్థానిక శ్రీనివాస తైక్వాండో క్లబ్ విద్యార్థినులు పలు విభాగాల్లో మూడు గోల్డ్ మెడల్స్, సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. సోమవారం అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విజేతలను అభినందించారు. ఈ నెల 11న కాకినాడ జిల్లా స్టేడియంలో 30వ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్స్, సీనియర్స్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు జరిగాయని త్రిమూర్తులు తెలిపారు. సీనియర్ విభాగంలో పితాని భార్గవి శ్రీకళ, కె.లక్ష్మీప్రసన్న గోల్డ్ మెడల్స్, కె.వినూత్న సిల్వర్ మెడల్, డి.రాఘవేంద్ర బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. జూనియర్ విభాగంలో ఎ.ఆదిత్య గోల్డ్, ఏబీ చైతన్య బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారన్నారు. క్రీడాకారులను ఎస్సై కె.చిరంజీవి, హెచ్‌ఎం కె.సాయిరామ్, ఎస్‌ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, పీడీ కె.ఆదిలక్ష్మి, పీఈటీ అందె సూర్యకుమారి అభినందించారు.

వరలక్ష్మీ కానుక విజయవంతం

గోకవరం: హిందూ ధర్మ పరిరక్షణకు చేపట్టిన బంగారు వరలక్ష్మీ కానుక విజయవంతం అయ్యిందని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు వెల్లడించారు. గోకవరం సూర్యఫంక్షన్ హాలులో సోమవారం బంగారు వరలక్ష్మీ కానుక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మహిళలకు లక్కీడ్రా నిర్వహించి 133 మందికి బంగారు రూపులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 17 వేల మంది పేర్లు నమోదు చేశామన్నారు. వీరిలో లక్కీ డ్రా ద్వారా 440 మందికి గ్రాము బంగారు రూపుని అందించామన్నారు.

కాలేజీ నిర్మాణం

- జిల్లాలో వైద్య కళాశాల పనులకు గ్రహణం
- గత ప్రభుత్వంలో రూ.500 కోట్లు మంజూరు
- కొత్త ప్రభుత్వం రాకతో ఆగిన అభివృద్ధి
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన స్థానికులు



అమలాపురంలో నిలిచిపోయిన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం

సాక్షి, అమలాపురం: కోనసీమ వాసుల చిరకాల స్వప్నం తీరే దారి కనబడడం లేదు.. అమలాపురం సమీపంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం ఇంచు కూడా కదలడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా మూడో దశలో ప్రారంభమైన ఈ కాలేజీల నిర్మాణాలకు నిధుల కొరత ఉండడంతో నిలిపివేయాలని సీఎం చంద్రబాబు సూచించడంతో పనులకు బ్రేక్ పడ్డాయని స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వారంతా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు సోమవారం మొరపెట్టుకున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ మంజూరు చేసింది. ఇందుకు రూ.500 కోట్లు కేటాయించింది. అమలాపురం రూరల్ సమనస, చిందాడగరువు పరిధిలో దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా తొలి, రెండో దశలో నిర్మాణ పనులు మొదలు పెట్టిన పలు మెడికల్ కాలేజీలు పూర్తి కావడం, అక్కడ తరగతులు ప్రారంభం కావడం తెలిసిందే. మూడో దశలో అమలాపురంలో మెడికల్ కాలేజీ నిర్మాణం మొదలు పెట్టారు. దీనికి అనుబంధంగా అమలాపురం ఏరియా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా గుర్తించారు. ఇది ప్రస్తుతం 100 పడకల ఆసుపత్రి కాగా, దీనిని వెయ్యి పడకల ఆసుపత్రిగా విస్తరించాలని నిర్ణయించారు. తొలి దశలో 650 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు రెండో దశలో 350 పడకలు చేయాలని నిర్ణయించారు. దీనివల్ల అమలాపురం నడిబొడ్డున అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అందుబాటులోకి వస్తోందని ప్రజలు ఆనందపడ్డారు.

అప్పుడు వేగం.. ఇప్పుడు జాప్యం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరిగాయి. పలు నిర్మాణాలు చురుగ్గా సాగాయి. కొన్ని భవనాలకు రెండు, నాలుగు అంతస్తులు నిర్మించారు. అయితే ఎన్నికల నాటి నుంచి నెమ్మదించిన పనులు కొత్త ప్రభుత్వంలో దాదాపు నిలిచిపోయే పరిస్థితికి వచ్చాయి. నిధుల కొరతతో మూడో దశ ఆసుపత్రి నిర్మాణ పనులు నిలిపివేయాలని కూటమి ప్రభుత్వం నుంచి సూచనలు అందడంతో నిర్మాణ సంస్థ మేఘా ఇంజినీరింగ్ ఇక్కడ పనులు ఆపేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగా పనుల్లో వినియోగించే కీలక సామగ్రి తరలిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. దీనిపై స్పందించేందుకు ఆ సంస్థ ప్రతినిధులు నిరాకరించారు.

పనులు కొనసాగించండి

మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు నిలిచిపోయాయని స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు వినతిపత్రంతో పాటు మెడికల్ కాలేజీ నిర్మాణ పనులకు వినియోగించిన సామగ్రి తరలిపోతున్న ఫొటోలను సైతం జత చేశారు. మెడికల్ కళాశాలకు గత ప్రభుత్వం 47 ఎకరాల భూమి కొనుగోలు చేసి నిర్మాణ పనులు మొదలు పెట్టింది. ఇప్పటి వరకూ 40 శాతం పనులు జరిగాయని వివరించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత మూడో దశలో మెడికల్ కళాశాలల పనులు నిలిపివేయాలని ఆదేశాలు వచ్చినట్లు గుత్తేదారు సంస్థ చెబుతోందని, నిర్మాణ సామగ్రితోపాటు ఐరన్, ఇసుక, సిమెంట్‌ను మెగా సంస్థ తరలించుకుపోతోందని చెప్పారు. కళాశాలను పూర్తి చేయాలని వారు కోరారు. అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచ్ పొనకల గణేష్, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ జలదాని కాశీ విశ్వేశ్వరరావు, కరెళ్ల సూరిబాబు, వై.ఏసుబాబు, సీహెచ్‌వీ రావు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ మహేష్ కుమార్‌కు సమస్యను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆశలపై నీళ్లు

గత ప్రభుత్వం మెడికల్ కాలేజీకి అనుమతి ఇవ్వడంతో పాటు 47 ఎకరాలు కొనుగోలు చేసి పనులు మొదలు పెట్టింది. ఈ పనులు వేగంగా జరగడం చూసి కొత్తగా ఏర్పడిన కోనసీమ జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ, బోధనాసుపత్రి లేని లోటు తీరుతోందని జిల్లా వాసులు సంబరపడ్డారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరాల్లో మాత్రమే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు (జీజీహెచ్)లు ఉన్నాయి. కోనసీమలో కిమ్స్ ప్రైవేట్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఉన్నా రోగుల అవసరాలు పూర్తిగా తీర్చడం లేదు. అమలాపురం, రామచంద్రపురం మున్సిపాలిటీల్లో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. జనరల్ ఆసుపత్రి లేని లోటు పట్టిపీడిస్తోంది. రామచంద్రపురం, మండపేటలకు కాకినాడ, రాజమహేంద్రవరం కొంత దగ్గర. కానీ అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలకు దూరం అవుతోంది. ఇక్కడ జీజీహెచ్ నిర్మించాలని స్థానికులు దశాబ్దాలుగా కోరుతున్నా ఫలితం లేకుండా పోయింది. రూ.కోట్ల విలువైన చమురు, సహజ వాయువులను కొల్లగొట్టుకుపోతున్న చమురు సంస్థలు సీఎస్‌ఆర్ నిధులతో మెడికల్ కాలేజీ, జీజీహెచ్ నిర్మించాలని కోరినా ఫలితం లేకుండా పోయింది. నగరం గ్యాస్ లీకేజీ వంటి భారీ ప్రమాదాలలో తక్షణం మెరుగైన వైద్యం అందించలేకపోయారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీ మంజూరు చేయడంతో ఆ లోటు తీరుతోందని, మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తోందని ఆశించినా ఇప్పుడు పనులు ఆగిపోవడం బాధాకరం. ప్రభుత్వం స్పందించి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లాం



మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు **నిలిచిపోయిన వి**షయాన్ని అమ**లాపురం ఎమ్మెల్యే** అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకు **వెళ్లాం. ఆయన** రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రితో **మాట్లాడతానని** చెప్పారు. నిర్మాణ పనులు నిలిచి**పోవడంపై స్థానికులు** ఆందోళన చెందుతున్నారు.

– పందిరి శ్రీహరి, జెడ్పీటీసీ సభ్యుడు, అమలాపురం

జల తాండవం

- జలాశయంలో గరిష్ట స్థాయికి నీటి నిల్వలు
- రోజుకు 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిండుకుండలా మారిన తాండవ జలాశయం

కోటనందూరు: తాండవ జలాశయంలో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతూ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 375.5 అడుగులకు చేరింది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి రోజూ 300 క్యూసెక్కుల వరకూ ఇన్‌ఫ్లో వస్తుండడంతో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయని డీఈఈ అనురాధ తెలిపారు. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా నీటి నిల్వలు 378 అడుగులకు చేరిన తరువాత అదనపు జలాలను స్పిల్‌వే ద్వారా సముద్రానికి విడిచిపెడతామని వివరించారు. సముద్రానికి నీటిని విడిచిపెట్టాల్సి వస్తే రెవెన్యూ, పోలీసు శాఖలతో పాటు ఆయకట్టు రైతులకు సమాచారం ఇస్తామని తెలిపారు.

19న నీటి విడుదల

తాండవ జలాశయం నుంచి ఆయకట్టుకు ఈ నెల 19న ఉదయం 8 గంటలకు నీటిని విడుదల చేయుటకు నిర్ణయం తీసుకున్నామని ప్రాజెక్టు డీఈఈ పి.అనురాధ తెలిపారు. ఆ రోజు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ విభాగం ముమ్మరంగా కాలువలపై పర్యటించి కాలువల స్థితిగతులను పరిశీలిస్తున్నామన్నారు. సాగునీరు వృథా పోకుండా శిథిలమైన కాలువ గట్ల మరమ్మతులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రైతులంతా సమన్వయంతో సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

మాజీ సీఎం జగన్ చిత్రం తొలగింపు

- సచివాలయ వ్యవస్థ పైలాన్‌పై లోగో కూడా మాయం
- జనసేన నాయకుల నిర్వాకం

కరప: పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ఆ ఏడాది అక్టోబర్ నెల 2 గాంధీ జయంతి రోజున రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ వ్యవస్థను కరప నుంచి ఆయన లాంఛనంగా ప్రారంభించి, పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరప గ్రామసచివాలయం-1 వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌కు నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగులు వేసి, పైభాగంలో నాలుగుపక్కలా నవరత్నాల చక్రం లోగోలో జగన్ ముఖచిత్రం ఉండేలా విద్యుద్దీపాలతో గ్రామసర్పంచ్ సాదే ఆశాజ్యోతి ఏర్పాటు చేశారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జనసేన పార్టీ తరఫున పోటీచేసిన పంతం నానాజీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి ఆ పార్టీ మండల నాయకులు పైలాన్‌ను తొలగించాలని చూడగా గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ జీఓ లేకుండా పైలాన్ తొలగించడానికి వీలులేదని చెప్పారు. తర్వాత నాగేంద్రకుమార్‌కు గ్రేడ్-1 కార్యదర్శిగా పదోన్నతి రాగా, బదిలీపై వెళ్లారు. తర్వాత మళ్లీ జేఎస్‌పీ నాయకులు పైలాన్‌పై ఉండే జగన్ చిత్రాన్ని తొలగించాలని పట్టుబట్టి తొలగించారు. పైలాన్ పైభాగంలో నాలుగుసింహాల బొమ్మను ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టారు. వైఎస్సార్ సీపీ జెండా రంగులు తొలగించి టీడీపీ, జనసేన రంగులు వేస్తే ఊరుకోబోమని, జాతీయజెండా రంగులు వేస్తే అభ్యంతరం లేదని, మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరుతో ఉన్న శిలాఫలకం తొలగించినా అంగీకరించమని సర్పంచ్ ఆశాజ్యోతి తెలిపారు. పనులు పూర్తయ్యాక, రంగులు ఏమి వేస్తారో వేచి చూస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.



పైలాన్ పైభాగంలో జగన్ చిత్రం తొలగించి, నాలుగు సింహాల బొమ్మను ఏర్పాటు చేసేందుకు పనులు చేస్తున్న తాపీమేస్త్రులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

అధికారులతో కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని అధికారులకు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సుమారు 181 అర్జీలు ఇవ్వగా, వాటిని కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని సూచించారు. జిల్లా కేంద్రం వరకూ అర్జీదారులు రావాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే అధికారులు అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. డీఆర్డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావు దొర పాల్గొన్నారు. అనంతరం 21న రావులపాలెం శ్రీసత్యసాయి విద్యా సంస్థల్లో వికాస ఆధ్వర్యంలో 25 కంపెనీల ప్రతినిధులతో నిర్వహించనున్న జాబ్ మేళా వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

200 గ్రామాల్లో ప్రచార సదస్సులు

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు నీకు తెలుసా అనే ఇంటెన్సివ్ ఫైడ్ ప్రచార అవగాహన సదస్సులను జిల్లాలోని 200 గ్రామాల్లో నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై సమాజంలో ఉన్న అపోహలను తొలగించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు ఏఆర్‌టీ మందులను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్నారన్నారు. దీనిపట్ల సమగ్ర సమాచారాన్ని తెలుసుకునేందుకు నేషనల్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ 1097 ఏర్పాటు చేశారని అన్నారు. డీసీహెచ్ ఎస్.కార్తీక్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి సీహెచ్ వి.భరతలక్ష్మి, హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రచార సదస్సుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

పారిశుధ్యంపై దృష్టి సారించండి

గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆయన ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణ, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ అంశాలపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పారిశుధ్య సమస్య తలెత్తకుండా, వ్యాధులు ప్రబలకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు జి.కేశవవర్ధన్‌రెడ్డి, ఎస్.సుధాసాగర్ పాల్గొన్నారు.

చురుగ్గా సత్యగిరికి మెట్ల నిర్మాణం

రూ.10.50 లక్షలతో చేపట్టిన దేవస్థానం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సత్యగిరిపై గల హరిహరసదన్, శివసదన్ సత్రాలలో బస చేసే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు దేవస్థానం అధికారులు మెట్లదారి నిర్మాణం చేపట్టారు. సత్యగిరి దిగువన గల విద్యుత్ సబ్‌స్టేషన్ పక్క నుంచి సత్యగిరి ఘాట్‌రోడ్డు మూడో మలుపు వరకు రూ.10.50 లక్షల వ్యయంతో చేపట్టిన మెట్ల దారి నిర్మాణం ముగింపు దశకు చేరుకుంది. సత్యగిరిపై వంద గదుల హరిహరసదన్ సత్రం, 135 గదుల శివసదన్ సత్రం, రెండు ఉచిత కల్యాణ మంటపాలు, విష్ణుసదన్‌లోని 46 మ్యారేజ్ హాల్స్ ఉన్నాయి. సత్రాలలోని గదులలో భక్తులు బస చేస్తారు. బస చేసే భక్తులలో సొంత వాహనాలు లేనివారే అధికంగా ఉంటారు. స్వామివారి ఆలయానికి రావాలన్నా, మళ్లీ తిరిగి వెళ్లాలన్నా ఘాట్‌రోడ్ ద్వారా నడిచి లేదా వాహనాలలో వెళ్లాల్సి వచ్చేది. దేవస్థానం సత్యగిరి- రత్నగిరి మధ్య ఉచిత బస్సు నడుపుతున్నా అది అన్ని వేళలా అందుబాటులో ఉండదు. దాంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆటోలకు ఎక్కువ మొత్తంలో ఛార్జి చేస్తుండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

మెట్ల దారి వల్ల ఎంతో మేలు

సత్యగిరికి నిర్మిస్తున్న మెట్లదారి వలన భక్తులకు కొంతమేర ఇబ్బంది తొలగనుంది. సత్యగిరి ఘాట్‌రోడ్ ప్రారంభంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఘాట్‌రోడ్ మొదటి మలుపు వరకు గల వంద మెట్లు, అక్కడ నుంచి రెండో మలుపు వరకు మరో 30 మెట్ల నిర్మాణం చేపట్టి దాదాపుగా పూర్తి చేశారు. ఈ మెట్ల నుంచి హరిహరసదన్, శివసదన్ సత్రాలు వంద మీటర్లు దూరం మాత్రమే ఉంటాయి. దీంతో ఆ సత్రాలలో బస చేసే భక్తులు ఆటోలు, బస్‌లు అందుబాటులో లేకపోయినా సులభంగా చేరుకోవచ్చు. ఈ మెట్లకు ప్రస్తుతం ప్లాస్టింగ్‌లు జరుగుతున్నాయని మరో వారం రోజుల్లో అవి పూర్తవుతాయని అధికారులు తెలిపారు.



సాగుతున్న మెట్ల దారి నిర్మాణ పనులు

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి కౌలురైతు మృతి



తిమ్మరాజుపాలెంలో కరెంట్ షాక్‌తో మృతి చెందిన మరపట్ల గంగరాజు

నిడదవోలు రూరల్: విద్యుదాఘాతానికి గురై ఓ కౌలు రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు మరపట్ల గంగరాజు (40) కోటసత్తెమ్మ గుడి వెనుక ఉన్న పొలాలను కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. ఇటీవల ఎర్రకాలువ వరదతో చేను మొత్తం నీటమునిగి నారు కుళ్లిపోయింది. దీంతో మళ్లీ నారుమడి వేసిన గంగరాజు పొలంలో గెడకు కట్టిన విద్యుత్ తీగను సరిచేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిడదవోలు పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకూ ఓ లెక్క

- వచ్చే నెల 1 నుంచి జాతీయ పశుగణన
- నాలుగు నెలల పాటు నిర్వహణ
- 340 మంది సిబ్బంది నియామకం
- 4.81 లక్షల నివాసాల్లో గణనకు ఏర్పాట్లు

రాయవరం: ఇక పశువుల లెక్క పక్కాగా ఉండనుంది.. మనుషుల మాదిరిగానే మూగజీవాల గణన జరగనుంది. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఈ ప్రక్రియ వచ్చే నెల 1 నుంచి మొదలు కానుంది. జిల్లాలో 21వ జాతీయ పశుగణనను ప్రారంభించేందుకు పశు సంవర్ధక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పశుగణన చేపట్టే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. నాలుగు నెలల పాటు నిర్వహించే పశుగణనలో మూగజీవాల లెక్క తేలనుంది. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకూ పక్కాగా పశుగణన నిర్వహించనున్నారు. ఇప్పటికే కోనసీమ జిల్లా వ్యాప్తంగా 286 మంది ఎన్యూమరేటర్లు, 54 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఎన్యూమరేషన్ అనంతరం నిర్దేశించిన అధికారులు స్క్రూటినీ చేస్తారు. వీరంతా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ కర్నీడిమూర్తి పర్యవేక్షణలో పశుగణన చేపట్టనున్నారు.

ప్రతి ఐదేళ్లకోసారి..

దేశంలో తొలిసారిగా జాతీయ పశుగణనను 1919–20లో చేపట్టారు. అప్పటి నుంచి ప్రతి ఐదేళ్లకో సారి గణన చేపడుతున్నారు. పశువుల జీవిత కాలం తక్కువగా ఉంటుంది. అదే సమయంలో పునరుత్పత్తి శక్తి అధికంగా ఉంటుంది. అందువల్ల ప్రతి ఐదేళ్లకొకసారి జాతీయ పశుగణన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది. ప్రస్తుతం 21వ జాతీయ పశుగణన ప్రారంభం కానుంది.

19, 20వ జాతీయ పశుగణన ప్రకారం జిల్లాలో మూగజీవాలు

పశువులు	19వ పశుగణన	20వ పశుగణన
ఆవులు	3,77,257	2,26,740
గేదెలు	6,43,948	6,29,662
గొర్రెలు	2,47,670	3,37,603
మేకలు	2,94,054	1,94,653
పందులు	32,723	39197
ఫౌల్ట్రీ, నాటు కోళ్లు	2,83,37,640	3,06,24,292

లెక్కపెట్టేది ఇలా..

పశుగణనలో భాగంగా గ్రామాల్లోని ప్రతి నివాసాన్ని ఎన్యూమరేటర్ సందర్శిస్తారు. గేదెలు, ఆవులు, వాటి జాతులు, కోళ్లు, వాటి జాతి రకాలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు తదితర పశు జాతులను నమోదు చేస్తారు. ప్రతి రెవెన్యూ విలేజ్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించారు. ఈ విధంగా 425 రెవెన్యూ గ్రామాలు, వార్డులను 286 మంది ఎన్యూమరేటర్లకు కేటాయించారు. గతంలో టాబ్స్ ద్వారా ఆన్‌లైన్‌లోనే గణన చేపట్టగా, ఈసారి ఎన్యూమరేటర్ ఫోన్‌లోనే యాప్ ద్వారా ఎన్యూమరేషన్ చేపట్టనున్నారు. జిల్లాలో 4,81,168 నివాసాలను గణన చేయాల్సి ఉంది. ఆవుల్లో ఒంగోలు, పుంగనూరు, సాహివాల్, గిర్, జెర్సీ, హెచ్‌ఎఫ్ సంకరజాతి, గేదెల్లో ముర్రా, గ్రేడెడ్ ముర్రా, కోళ్లలో టర్కీ, నాటు, కముజు పిట్టలు, ఫారం కోళ్ల రకాలుంటాయి. అలాగే మేకలు, గొర్రెలు, పందులు, కుక్కలు, పెరటికోళ్లు, బాతులు, సేద్యపు ఎద్దులు ఇలా వేర్వేరుగా నమోదు చేయాలి. పశు సంపదతో పాటు ఆ గ్రామంలో పశువైద్యశాల ఉందా? లేదా? పాలసేకరణ కేంద్రం, పశుగ్రాస క్షేత్రాలు ఉన్నాయా? లేవా? పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారా? లేక సొంతంగా చేపడుతున్నారా? తదితర విషయాలను నమోదు చేయాల్సి ఉంటుంది. పశు యజమాని అక్షరాస్యుడా? నిరక్షరాస్యుడా? పశు సంపద ద్వారా ఎంత ఆదాయం వస్తుంది? పశువుల షెడ్డు ఉందా? లేక ఆరుబయట పశువులను కడుతున్నారా? గొర్రెల సొసైటీలు ఉన్నాయా? పశువధశాల ఉందా? పశువుల సంరక్షణలో పురుషులు/ స్త్రీలు ఎవరు ఎక్కువ సంరక్షణ చేస్తున్నారనే విషయాలను కూడా పశు గణకులు సేకరించనున్నారు.





పశుగణన షెడ్యూల్, మాన్యువల్స్‌ను విడుదల చేసిన పశుసంవర్ధక శాఖ అధికారులు

సమాచారం ఇవ్వకుంటే నష్టం

పశుగణన ఆధారంగానే జిల్లాకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ రానుంది. పశువుల సంఖ్యను బట్టే వ్యాధి నిరోధక టీకాలు, నట్టల వ్యాధి నివారణ మందులు సరఫరా చేస్తారు. ఇదంతా సక్రమంగా జరగాలంటే రైతులు కచ్చితమైన సమాచారాన్ని ఎన్యూమరేటర్లకు అందజేయాలి. అయితే చాలా మంది రైతులు పశు సంపద సమాచారాన్ని పూర్తి స్థాయిలో ఇచ్చేందుకు నిరాకరిస్తుంటారు. పూర్తి సమాచారం ఇస్తే ఆదాయపు పన్ను పరిధిలోకి వస్తామన్న అపోహలతో సమాచారం ఇవ్వరు. దీనివల్ల పరోక్షంగా రైతులకే నష్టం చేకూరుతుందని పశు వైద్యులు పేర్కొంటున్నారు.

రైతులకు మేలు



పశుగణనకు రైతులు సహకరించాలి. కచ్చితమైన సమాచారం అందించడం వల్ల రైతులకే ప్రయోజనం చేకూరుతుంది. ఈ విషయాన్ని రైతులు గ్రహించి, పశు గణకులకు పూర్తి సహకారం అందించాలి. అప్పుడే ఈ కార్యక్రమం సక్రమంగా పూర్తవుతుంది. –బి.సుభాష్ చంద్ర, పశుగణన జిల్లానోడల్ అధికారి, కోనసీమ

అన్ని ఏర్పాట్లు పూర్తి



21వ జాతీయ పశుగణనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించి శిక్షణ ఇచ్చాం. కచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని గణకులకు సూచించాం. రైతులు కచ్చితమైన సమాచారాన్ని ఎన్యూమరేటర్లకు అందించాలి. –కర్నీడి మూర్తి, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా పశు సంవర్ధక శాఖ, కోనసీమ

రోడ్డు ప్రమాదంలో యూ ట్యూబర్ మృతి

తొండంగి: బైక్ రైడర్‌గా, యూట్యూబర్‌గా సోషల్ మీడియాలో పేరొందిన పొగాకు సోంబాబు (క్రేజీ సొంబాబు) బైక్‌పై వెళ్తుండగా కాకినాడ జిల్లా బెండపూడి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నెల్లూరుకు చెందిన పొగాకు సోంబాబు (35) వృత్తి రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ప్రకృతి అందాలను చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేవారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం రాజమహేంద్రవరంలో స్నేహితుల వివాహానికి తోటి బైక్‌రైడర్స్‌తో కలిసి హాజరయ్యారు. అనంతరం బైక్‌లపై దునపాటి రాజేష్, వెంకట్‌లతో కలసి ఏజెన్సీ ప్రాంతమైన లంబసింగి, అరకు తదితర ప్రాంతాలను సందర్శించారు. అనంతరం విశాఖ నుంచి రాజమహేంద్రవరం బయలుదేరారు. అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారు. సోంబాబు బైక్‌ను జాతీయ రహదారిపై బెండపూడి వై.జంక్షన్ వద్ద భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలైన సోంబాబును 108 అంబులెన్స్‌లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సోంబాబు (ఫైల్)



ప్రమాదంలో గాయపడిన సోంబాబును 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

యువకుడి అదృశ్యం



నోయల్ జార్జి (ఫైల్)

మలికిపురం: మలికిపురం గ్రామానికి చెందిన పడమటి నోయల్ జార్జి (19) అదృశ్యమైనట్లు ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ సోమవారం తెలిపారు. ఈ మేరకు యువకుడి తండ్రి రత్నంరాజు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ నెల 9న దిండి చించినాడ బ్రిడ్జి వద్ద తన మోటార్ సైకిల్ ఉంచి అక్కడి నుంచి తన తండ్రికి ఫోన్ చేసినట్లు ఎస్సై చెప్పారు. అప్పటి నుంచి సెల్ స్విచాఫ్ చేసినట్లు ఆయన వివరించారు.

వేధింపులపై వివాహిత ఫిర్యాదు

అంబాజీపేట: తన కాపురం సజావుగా జరగకుండా భర్తతో పాటు అత్తమామలు వేధిస్తున్నారని ఓ వివాహిత అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. గంగలకుర్రు అగ్రహారానికి చెందిన ఓ వివాహితకు 2014లో అన్నవరానికి చెందిన దాసరి లక్ష్మణ్‌తో వివాహం జరిగింది. వివాహమైనప్పటి నుంచి భర్త, అత్త, మామలు, ఇతర కుటుంబ సభ్యులు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ఆమె అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే అక్కడ న్యాయం జరగకపోవడంతో తన పుట్టిల్లు అయిన గంగలకుర్రు అగ్రహారం వచ్చి కుటుంబ సభ్యుల సాయంతో ఇక్కడ మరోసారి ఫిర్యాదు అందించింది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు.

కొబ్బరి చెట్టును ఢీ కొట్టిన కారు

అంబాజీపేట: శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఓ కారు అదుపుతప్పి నందంపూడి వంతెన సమీపంలో సోమవారం కొబ్బరి చెట్టును బలంగా ఢీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లవరం మండలం గూడాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు, ముగ్గురు మహిళలతో పాటు ఓ చిన్నారి సాంత్రో కారులో పి.గన్నవరం మండలం గంటిలో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని గూడాల వెళుతుండగా నందంపూడి ప్రధాన రహదారి పక్కనే ఉన్న కొబ్బరి చెట్టును కారు అదుపు తప్పి బలంగా ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి 108లో తరలించినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

నేను ప్రత్యేకాధికారిని.. చెప్పినట్టు వినండి

- అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలతో హడావుడి
- నకిలీ అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సీటీఆర్ఐ: నేనే ప్రత్యేక అధికారిని.. నేను చెప్పినట్లు వినాలి.. లేదంటే మీ ఉద్యోగాలు ఊడిపోతాయంటూ కొన్ని రోజులుగా ఒక వ్యక్తి హల్‌చల్ చేస్తున్నాడు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందిని తనిఖీల పేరిట భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. ఆ వివరాల్లోకి వెళితే.. మూడు రోజులుగా కొవ్వూరులోని ఆరికిరేవులు, చాగల్లు, తాళ్లపూడిలోని 124 అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక వ్యక్తి వచ్చి తాను ప్రత్యేక అధికారిని అని, రికార్డులు తనిఖీ చేయడానికి వచ్చానని సిబ్బందికి తెలిపాడు. అంతే కాకుండా తన మాట వినకపోతే ఉద్యోగాలు పోతాయని బెదిరించాడు. అక్కడున్న అంగన్‌వాడీ సిబ్బందితో సెల్ఫీలు దిగమని బలవంతం చేశాడు. తనిఖీల్లో ఇదో భాగమని, సెల్ఫీలు దిగకపోతే తనిఖీలు పూర్తి కాదని బెదిరించాడు. దీంతో హడలిపోయిన అంగన్‌వాడీ సిబ్బంది ఇతను నిజంగానే ప్రభుత్వ అధికారి అనుకుని తనిఖీలకు అనుమతి ఇచ్చారు. కానీ ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.బేబీరాణి దృష్టికి తీసుకు రావడంతో ఆమె అంగన్‌వాడీ పీడీకి తెలిపారు. చివరికి అతను నకిలీ అధికారి అని గుర్తించారు. వారంతా కలసి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం ఇచ్చి సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ అతనెవరో తెలుసుకుని పోలీసు కేసు పెట్టాలని ఆదేశించారు.



కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

బాలికల కిడ్నాప్ కేసు సుఖాంతం

- తల్లి చెంతకు చేరిన కుమార్తెలు
- పోలీసుల అదుపులో నిందితుడు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం రేపిన ఇద్దరు బాలికల కిడ్నాప్ కేసు సుఖాంతమైంది. దీనిపై సోమవారం స్థానిక జాంపేటలోని దిశ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ డి.నరసింహకిశోర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ వివరాలు ఇలా.. ఒడిశాలోని బరంపురానికి చెందిన ఒక మహిళ తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో కలసి ఎనిమిదేళ్లుగా ధవళేశ్వరంలో ఉంటోంది. కుమార్తెలిద్దరూ కాకినాడలోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. మే నెలలో సెలవుల రావడంతో ధవళేశ్వరంలో ఇంటికి వచ్చారు. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం పెదమనపురానికి చెందిన మారోజు వెంకటేష్ వీరు ఉంటున్న ఇంటి పైపోర్షన్‌లో తన చెల్లి అని చెప్పుకొంటూ మరో యువతితో నాలుగు నెలలుగా అద్దెకు ఉంటున్నాడు. ఒకే ఇంట్లో ఉంటున్న వెంకటేష్‌కు, ఆ బాలికలు, వారి తల్లి మధ్య స్నేహం పెరిగింది. ఆ బాలికల తల్లికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి గత నెల 10న ఆమెను, ఆమె చిన్న కుమార్తెను విజయవాడ తీసుకువెళ్లి ఓ లాడ్జిలో ఉంచాడు. ఆమె దగ్గర ఉన్న డబ్బులు తీసుకుని ఆమెకు ఉద్యోగం ఇప్పిస్తాననే నెపంతో అప్పుడప్పుడు రైల్వే స్టేషన్‌కు తీసుకువెళ్లి అక్కడ సీసీ కెమెరాల ముందు నిలబెట్టి కెమెరా ద్వారా నీకు అటెండెన్స్ తీసుకుంటున్నారని చెప్పి నమ్మించాడు. తర్వాత ధవళేశ్వరం వచ్చి ఆమె కుమారుడిని తీసుకువెళ్లి ఆమె దగ్గరకు చేర్చాడు. ఆమె చిన్న కుమార్తెను తీసుకుని విజయవాడ నుంచి 21న ధవళేశ్వరం వచ్చాడు. ఆమె కుమార్తెలు ఇద్దరినీ హాస్టల్‌లో దించుతానని చెప్పి 22న తీసుకు వెళ్లాడు. తనతో పాటు తీసుకువచ్చిన విజయనగరం జిల్లాకు చెందిన బాలికను విశాఖపట్నానికి పంపించేశాడు. పది రోజుల్లో తాను వచ్చి పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మబలికాడు. ఇదిలా ఉండగా గత నెల 28వ తేదీ నుంచి వెంకటేష్ ఫోన్ స్విచాఫ్ రావడంతో తల్లికి అనుమానం వచ్చింది. హాస్టల్‌లో తన పిల్లల కోసం ఆరా తీయగా వారు రాలేదని చెప్పడంతో ఆమె ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

ఎస్పీ ఆదేశాలతో కేసు వేగవంతం

బాలికల అదృశ్యం కేసును జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ వేగవంతం చేశారు. గత నెల 22వ తేదీ తర్వాత రాజమహేంద్రవరంలోని ఓ హోటల్లో ఒకరోజు, ఆ తర్వాత నెల్లూరులో హోటల్లో ఒకరోజు ఆ పిల్లలతో వెంకటేష్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 28వ తేదీ నుంచి అతని ఫోన్ గుంటూరు పరిసర ప్రాంతంలో స్విచాఫ్ చేశాడు. నిందితుడి కదలికల తెలుసుకున్న పోలీసులు పక్కా సమాచారంతో ప్రత్యేక పోలీసు బృందం చెన్నై సమీపంలో నిఘా పెట్టింది. 11న వెంకటేష్ ఇద్దరు బాలికలతో ట్రైన్‌లో వెళుతుండగా పట్టుకున్నారు.

మోసపూరిత మాటలు చెప్పి..

మీ అమ్మ మీ నాన్నను చంపేసిందని, ఇప్పుడు ఆమె జైలులో ఉందని ఆ బాలికలకు తెలిపాడు. మీరు ఇంక నాతోనే ఉండాలని చెబుతూ లాడ్జి రూమ్‌లలో వాళ్లిద్దరికీ వేర్వేరుగా తాళిబొట్టు లాంటిది కట్టి, వీడియో తీసి పెళ్లయినట్లే అని వాళ్లను మభ్యపెట్టాడు. ఆ నెపంతో వాళ్లను లొంగదీసుకుని తన తోనే ఉంచుకుని తిప్పుకొన్నాడు. నెల్లూరు ప్రగతినగర్‌లో ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని వారితో అక్కడ ఉన్నాడు. తాను రైల్వే టీసీగా పనిచేస్తున్నానని నమ్మబలికాడు. తన వద్దనే ఉన్న ఆ పిల్లల తల్లి సెల్‌ఫోన్ ద్వారా ఆమె అకౌంట్లోని సుమారు రూ.2 లక్షలు తీసేసుకున్నాడు. ఈ కేసులో అరెస్టయిన వెంకటేష్ వద్ద రైల్వే టీటీలు వాడే బ్యాగు, రైలులో టిక్కెట్ లేని ప్రయాణం చేసిన వారికి రాసే జరిమానా రసీదు పుస్తకాలు, రైల్వే టీసీగా తయారు చేయించుకున్న నకిలీ ఐడెంటిటీ కార్డు, మూడు సెల్ ఫోన్లు, ఫిర్యాది అకౌంట్ నుంచి రూ.రెండు లక్షల్లో మిగిలిన రూ.69,600 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెంకటేష్‌పై కిడ్నాప్, ఉమెన్ ట్రాఫికింగ్, సెక్సువల్ ట్రాఫికింగ్ ఇన్ మైనర్స్, అత్యాచారం, పోక్సో కేసులను నమోదు చేశారు. బాలికలిద్దరినీ వైద్య పరీక్షల నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో కీలక పాత్ర వహించిన డీఎస్పీ అంబికా ప్రసాద్, సీఐలు జీవీ వినయ్‌మోహన్, టి.గణేష్, బి.సూర్య అప్పారావు, సబ్ ఇన్‌స్పెక్టర్లు బి.హరిబాబు, టి.క్రాంతికుమార్, బి.నాగదుర్గాప్రసాద్, ఎం.అయ్యప్పరెడ్డి, బి.వినోద్, చావా సురేష్, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డులను అందజేశారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఆహ్వానం

మధురపూడి (కోరుకొండ): దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 15న జరగనున్న స్వాతంత్య్ర దిన వేడుకల్లో పాల్గొనేందుకు సీతానగరం మండలం రఘుదేవపురం హైస్కూల్‌కు ఆహ్వానం అందింది. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంలో ప్రతిభ చాటినందుకు ఈ హైస్కూల్ ఎంపికైంది. ఇందులో భాగంగా ప్రాజెక్టు చేసి పదో తరగతి విద్యార్థిని హిహవర్షిని, హెచ్‌ఎం ఎం.శ్యామలాదేవికి ఆహ్వానం అందింది. ఈ మేరకు సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐదు స్కూళ్లకు ఆహ్వానం రాగా, ఇందులో రఘుదేవపురం హైస్కూల్ ఉండడం గర్వకారణమని అన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

పి.గన్నవరం: పలు ప్రాంతాల్లో దేవాలయాలు, షాపుల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురిని సోమవారం ఊడిమూడి వద్ద అరెస్ట్ చేసినట్టు పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. కారులో వచ్చి వారు షాపుల తాళాలతో పాటు ఆలయాల్లో హుండీలను పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారని ఆయన వివరించారు. మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన కాలే మాణిక్యాలరావు, కాలే సుబ్రహ్మణ్యం, చాగల్లు మండలం కలవలపల్లికి చెందిన యలమంచిలి దినేష్‌లను ఊడిమూడి వద్ద అరెస్ట్ చేసినట్టు ఆయన వివరించారు. వీరిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 10 కేసులు నమోదయ్యాయని తెలిపారు. వారి నుంచి రూ.33 వేలు, ఒక కంప్యూటర్, 8 మైక్ యాంప్లిఫైర్స్ తదితర వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అమలాపురం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఎస్సై వివరించారు.

బెండ సాగు.. లాభాలు బాగు

- సాగుకు ఇదే సరైన సమయం
- విత్తన ఎంపిక కీలకం



ఎం.అనూష, ఉద్యాన శాఖ అధికారి

రాయవరం: బెండ.. ఈ సాగు మన ప్రాంతాలకు ఎంతో అనుకూలం. వానాకాలం, వేసవి కాలంలోనూ పండించవచ్చు. ఖరీఫ్‌లో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లోనూ ఈ పంటను వేసుకోవచ్చు. నాణ్యమైన హైబ్రిడ్ విత్తన రకాలను ఎంచుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చు. అందుకే ఈ సాగు వైపు చాలా మంది రైతులు మళ్లుతున్నారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే బెండ సాగులో లాభాలు మెండుగా పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి ఎం.అనూష సూచించారు. అయితే రైతులు కాలానికి తగిన విత్తనాలను ఎంచుకోవాలని చెబుతున్నారు. ఈ పంటను జిల్లాలోని రాయవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, మండపేట, ఆలమూరు, అయినవిల్లి, రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం తదితర మండలాల్లో రైతులు అధికంగా పండిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 800 ఎకరాల్లో బెండను ప్రధాన, అంతర పంటలుగా కూడా సాగు చేస్తున్నారు. రైతులు తాము పండించిన పంటను రైతు బజార్లు, కూరగాయల మార్కెట్లో నేరుగా విక్రయిస్తున్నారు. కొందరు రైతులు పెద్ద మొత్తంలో సాగు చేస్తూ అమలాపురం, రావులపాలెం, రామచంద్రపురం, ద్రాక్షారామ, మండపేట పట్టణాల పరిధిలోని మార్కెట్‌లకు, రైతు బజార్లకు తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు.

పంట మార్పిడి అవశ్యం

వేడి వాతావరణానికి బెండ పంట అనుకూలమైంది. అతి చల్లని వాతావరణం పంట పెరుగుదలకు ప్రతికూలమైంది. వానా, వేసవి కాలాల్లో ఈ పంటను పండించాలి. ఒకసారి పంట వేసిన తర్వాత వెంటనే తిరిగి అదే పంట వేయరాదు. ప్రతి సీజన్‌లోనూ పంట మార్పిడి చేయాలి. హైబ్రిడ్ వంగడాలు సాగు చేసేటప్పుడు దేశవాళీ రకాలను దూరంగా విత్తుకోవాలి. ఐసోలేషన్ డిస్టెన్స్ పాటించాలి. హైబ్రిడ్ విత్తనాలు విత్తనశుద్ధి చేసి వస్తాయి. అయినా మరోసారి విత్తనశుద్ధి చేపడితే చాలా వరకూ చీడపీడలు తగ్గుతాయి. వాతావరణ పరిస్థితులను బట్టి బెండ పంటను సంరక్షించాలి. పంట ముంపునకు గురైనా, అధిక వర్షాలు పడినప్పుడు కచ్చితంగా యూరియా ద్రావణం, పొటాషియం నైట్రేట్ మందును ఒకసారి పిచికారీ చేయాలి.

పంట కాలం.. విత్తన రకం

వర్షాకాలం పంటను జూన్, జూలై, ఆగస్టు వరకూ, వేసవి కాలం పంటను జనవరి నుంచి ఫిబ్రవరి నెల వరకూ విత్తుకోవచ్చు. వర్షాకాలం పంటలో ఎకరాకు 4–6 కిలోలు, వేసవి పంటకు 7–8 కిలోలు, సంకర జాతి రకాలైతే 2 కిలోలు విత్తనంగా ఉపయోగించాలి. పర్బని క్రాంతి, అనామిక, ఆర్కా, అభయ, సంకర జాతి కోవకు చెందిన వర్ష, విశాల్, విజయ్, రవి హైబ్రిడ్స్, మహికో హైబ్రిడ్ నంబర్ 10, 64, ప్రియ, అవంతిక, సుప్రియ, ఐశ్వర్య, మిస్టిక్, ఎస్7109, తులసి మేలైన రకాలు.

విత్తే పద్ధతి.. ఎరువులు

విత్తే ముందు నేలను 4–5 సార్లు బాగా దున్నాలి. వర్షాకాలం పంటను 60 సెంటీమీటర్ల ఎడంతో బోదెల మీద 30 సెంటీమీటర్ల దూరంలో విత్తుకోవాలి. వేసవికాల పంటలో నేలను మళ్లుగా చేసి వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15–20 సెంటీమీటర్ల దూరం ఉండేటట్లు విత్తుకోవాలి. చివరి దుక్కిలో ఎకరాకు 6–8 టన్నుల పశువుల ఎరువును వేసి బాగా కలియదున్నాలి. 24 కిలోల భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. 48 కిలోల నత్రజనినిచ్చే ఎరువులను మూడు సమ భాగాలుగా ఆఖరి దుక్కి, విత్తిన 35, 45 రోజుల్లో వేయాలి. సంకర జాతి రకాలకు ఎరువులను 50 శాతం పెంచి వేయాలి.



చెల్లూరులో కళకళలాడుతున్న బెండ తోట

పాడి-పంట

కలుపు నివారణకు..

కలుపు నివారణకు పెండిమిథాలిన్ 30 శాతం ఎకరాకు 1.2 లీటర్ల చొప్పున విత్తిన వెంటనే లేదా మరుసటి రోజున పిచికారీ చేయాలి. విత్తిన 20–30 రోజుల సమయంలో కలుపు తీయాలి. వర్షాకాలంలో మట్టిని ఎగదోసి బోదెలు సరిచేయాలి. పంట పూత దశలో లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలి. దీనివల్ల 20–25 శాతం నత్రజని ఆదాతో పాటు అధిక దిగుబడి పొందవచ్చు. లీటరు నీటికి 5 మిల్లీగ్రాముల సూక్ష్మ పోషక పదార్థాల మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయడం వల్ల దిగుబడులు పెరుగుతాయి. కొన్ని రకాల పురుగులను నివారించడానికి పసుపు రంగు డబ్బాలకు గ్రీజు పూసి తోటలో అక్కడక్కడా ఏర్పాటు చేయాలి. లింగార్షక బుట్టలు, బంతి, ఆవాలు వంటి ట్రేప్ క్రాప్స్ వేసుకోవడం ద్వారా పురుగులను నివారించవచ్చు.

నీటి యాజమాన్యం

వర్షాకాలంలో అనుకూలంగా వానలు లేకపోతే 7–8 రోజులకు ఒకసారి నీరు పెట్టాలి. వేసవి పంటకు ప్రతి 4–5 రోజులకు ఒకసారి నీరు ఇవ్వాలి. విత్తిన 45 నుంచి 50 రోజులకు మొదట కోత వస్తుంది. ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి తప్పనిసరిగా కోత కోయాలి. ఎకరాకు వర్షాకాలంలో 3–4 టన్నులు, వేసవి కాలంలో 2–3 టన్నుల దిగుబడి వస్తుంది.